# ప్రత్యామ్నాయం

-ఎ.రాజరాజేశ్వరి

'వివాహ భోజనంబు వింతైన వంటకంబు' మాయాబజార్‌లోని పాట వస్తోంది. శివరావు ఆ మహానటుడిని, అతడు ఆరగించే వంటకాలను కన్నార్పకుండా చూస్తున్నాడు. భర్త మొహంలో హావ భావాలు గమనిస్తున్న సరళ గుండె గుబగుబలాడింది ఆ నటుడు తినే వంటకాలను చూస్తూ గుటకలు మింగుతున్న భర్త వాటిల్లో ఏది కావాలంటాడోనని. అప్పుడే వంట పని ముగించి విశ్రాంతిగా కూర్చుంది..ఆ పాట పూర్తయ్యేవరకూ ఓపికపట్టాడు.

"చూసావా సరళా! ఆ పాటెంత బాగుందో! ఆ పాత మధురాలు కదూ"

తరువాతి సంభాషణ ఎటు తిరుగుతుందో తెలుసు కాబట్టి పేలవంగా నవ్వి అవునన్నట్లుగా తలూపింది సరళ.

"చూసావా! ఎన్ని రకాల పిండి వంటలో? నిజంగా ఘటోత్కచుడి తిండి పుష్టి మెచ్చుకుని తీరాలి. అవునుగానీ నాకు బొబ్బట్లు తినాలనిపిస్తోంది. ఈ రోజు చేస్తావా?" ఆశగా అడుగుతున్న భర్తను చూసి ఉలిక్కిపడింది సరళ.

"బొబ్బట్లా? ఇప్పుడా? వంటయిపోయింది. భోజనానికి రండి" అంది ధ్యాస మళ్లిస్తూ.

అతడికి ఆకలనిపించి తాత్కాలికంగా తన కోరిక మరచిపోయి భార్య వండినవన్నీ ఏదీ వద లక సుష్టుగా భోజనం చేసాడు. చేయి కడు క్కుంటూ సరళకి మరోసారి గుర్తు చేసాడు.

"సాయంత్రానికి చేస్తావా నేనడిగింది?" అన్నాడు.

అతడి పట్టుదల తెలిసిన సరళ అంగీకారంగా తలూపింది.

శివరావుకి చిన్నతనం నుండీ కూడా తినడం అంటే చాలా ఇష్టం. ఇద్దరాడపిల్లల తరువాత చాలా సంవత్సరాలకి పుట్టిన శివరావంటే అతడి తల్లికి వల్లమాలిన ప్రేమ. అర్భకంగా పుట్టిన అతడు చిన్నికృష్ణుడిలా ముద్దుగా, బొద్దుగా ఉండాలని ఆవిడ కోరిక. అందుకే కొడుక్కి అన్ని రకాల వంటలు, పిండి వంటలు రుచిగా చేసి కొసరి కొసరి తినిపించేది. రెండుకూరలు, పప్పు, చారు, పచ్చడి, గడ్డపెరుగు అన్నీ యధావిధిగా ఉండాల్సిందే.

ఎక్కడైనా ఫంక్షనయితే శివరావుకి చాలా సర దాగా, సంతోషంగా అనిపిస్తుంది. అతడి హాజరు తప్పనిసరి. పెళ్లివంటలంటే అతడికి మహాప సందు. పనసపొట్టు కూర, ముక్కల పులుసు, బూరెలు, లడ్డులు, పులిహోర... అన్నీ ఏదీ వద లక లొట్టలేసుకుని తినేవాడు. అయినవారు అతడి తిండి పుష్టి చూసి సంతోషిస్తే కొత్తవారు ఆశ్చర్యంగా చూసేవారు.

శివరావు ఉద్యోగంలో చేరాక సంబంధాలు రావడం మొదలుపెట్టాయి. అక్కలకు పెళ్లిళ్లయి వెళ్లిపోయారు.

బాదరాబందీలు ఏమీలేవు. మంచి ఉద్యో గంలో ఉన్నాడు. గొప్ప సంబంధాలు కోరి చేసు కుంటామన్నా పట్టించుకోక తల్లికి తన మనసు లోని మాట చెప్పాడు అమ్మాయి అందంతో, డబ్బుతో పనిలేదని, తల్లి చేసినట్లుగా రుచిగా వండిపెడితే చాలని.

అయితే అతడి అదృష్టంకొద్దీ రూపవతి అయిన భార్య లభించింది. ఇంచుమించు తల్లి చేసినట్లుగా రుచిగా వండిపెట్టే భార్య సరళ అంటే అతడికి ప్రేమ. కానీ అతడిలోని బలహీ నత షడ్రుచుల వ్యామోహం. ముఖ్యంగా రకర కాల స్వీట్లు చాలా ఇష్టంగా తింటాడు.

సరళకి భర్త అభిరుచి మొదట్లో చాలా సర దాగా ఉండేది.

తను వండిన ప్రతి పదార్థం వదలకుండా మెచ్చుకుంటూ వుంటే మురిసిపోయేది. రాను రాను వేళాపాళా లేకుండా అతడి గొంతెమ్మ కోరి కలకు కోపం, విసుగు కలిగినా మౌనంగా కాదన లేక చేసి పెట్టేది.

అసలు కానీ కట్నం తీసుకోకుండా సరళ చేతి వంట రుచి చూసి సర్టిఫై చేసాకే పెళ్లి చేసు కున్నాడు.

'వంట మనిషిని పెట్టుకుంటే అయిపోతుంది కదా. వంట రుచి చూసి మరీ పెళ్లి చేసుకో వాలా?' అని ఎవరెంత వెక్కిరించినా పట్టించు కోక 'స్వంత మనిషికి, వంట మనిషికి తేడా లేదా?' అన్నాడు.

ఒకసారి పెళ్లయిన కొత్తల్లో పండగొస్తే అల్లుడి హోదాలో సరళ పుట్టింటికెళ్లాడు. అల్లుడి మర్యాదలు ఘనంగానే అందుకున్నాడు. ఉదయాన్నే పెసరట్టు, ఉప్మా లాగించేసాడు. పదిగంటలకు బయటకు వెళ్లొస్తానని జారుకుని దగ్గర్లోవున్న అయ్యర్ హోటల్లో ఇడ్లీ సాంబారు, వడ ఒక పట్టుపట్టాడు.

ఈ విషయం గమనించిన అతడి మామగారి స్నేహితుడు భద్రంగా ఆయన చెవిలో వేసాడు.

"కట్నం ఇవ్వలేదు సరే. నీ అల్లుడికి తిండి కూడా పెట్టడంలేదా? అత్తారింటికి వచ్చిన అల్లు డికి మర్యాద చేయక ఇలా హోటల్స్ చుట్టూ తిప్పితే మీ పరువే పోయేది" అన్నాడు మంద లింపుగా.

శివరావు తిండి పుష్టికి అప్పుడప్పుడే అల వాటు పడుతున్న సరళ అసలు విషయం తండ్రితో చెప్పింది.

"ఆ విషయం ముందే చెప్పొచ్చుకదా మాకు" అన్నాడు తండ్రి.

అప్పటినుంచి ఏ పండుగలు వచ్చినా నాలు గురకాల స్వీట్లు, హాట్లు కొని తెస్తే సరళ తల్లి అత డికి అన్నిరకాల పిండి వంటలు వండి వార్చలేక సతమతమయ్యేది.

అతడి బావమరుదులు, మరదలు "బావ బకాసురుడే. ఎలా వేగుతున్నావే అతడితో'' అని దండం పెట్టేసారు.

★★★

సరళ ఒకసారి తెలివి తెచ్చుకుని అతడికి తెలియకుండా స్వగృహ ఫుడ్స్ నుంచో, లేక ఎవరికయినా ఆర్డరిచ్చో చేయించుకొని పడేసేది అయిదారురకాలు.

మూడ్ బాగుంటే అభ్యంతరపెట్టక తినేవాడు. లేకుంటే "డబ్బు నీళ్లల్లా ఖర్చు పెట్టేస్తున్నావు. ఇంట్లోనే ఏమయినా చేసి ఉండొచ్చుకదా'' అని ధుమధుమలాడేవాడు.

బయట తిండి ప్రభావమో అతడి ప్రారబ్దమో కానీ అతడికి జాండిస్ వచ్చింది. ఆ దెబ్బతో చిరుతిండి కాదు కదా, మామూలు తిండికి కూడా గండి పడింది.

డాక్టర్ గట్టి వార్నింగ్ ఇచ్చాడు.

నూనె పదార్థాలు, వేపుడు కూరలు ఏమీ తినక కేవలం పథ్యం వంటలు మాత్రమే తినవలసి రావడంతో కుడితిలో పడ్డ ఎలుకలా గింజుకున్నాడు.

తనకి ఈ రోగం రావడానికి కారణం సరళ బద్ధకించి ఇంట్లో తయారుచేయక, బయట తిళ్లు కొని పడేయడమేనని రోజుకోసారి సాధించేవాడు.

సరళకి కూడా బాధనిపించింది.



సరైన తిండి తిప్పలు లేక నీరసించిపోయిన భర్తని చూసి "బుద్ధి వచ్చింది క్షమించండి. ఇక నుండి ఎంత కష్టమయినా ఇంట్లోనే చేస్తాను" అని లెంపలేసుకుంది.జాండిస్ తగ్గినా కూడా మళ్లీ తిరగబెట్టకుండా కఠిన పథ్యం చేసి డాక్టర్ చేత పూర్తిగా తగ్గిపోయింది, ఏమీలేదు అనిపించుకు న్నాడు.

★★★

మునుపటంత కాకపోయినా ఏదో ఒక చిరుతిండి అడుగుతూ ఉండ డంతో సరళకి మళ్లీ వంటిల్లు తప్పలేదు. నిలువ టిఫిన్లంటే ఏ మధ్యా హ్నామో తీరిక వేళలో చేయగలదు కానీ సడెన్‌గా ఫలానా చేసి పెట్టు అంటేనే సమస్య. కానీ ఏం చేస్తుంది? ఇలా తిండిపోతులా పెంచి పై లోకా లకు వెళ్లిపోయిన అత్తగారిని మనసులోనే తిట్టుకుంటుంది.

## కొబ్బరిపీచు తీసి పెట్టే కుక్క

కేలికట్ జిల్లాలో కాటకరా గ్రామంలో సుజిత్ అనే ప్లంబరు రెండున్నర ఏళ్ల లాబ్రడార్-షెఫర్డ్ సంకరజాతి కుక్కని పెంచుకుంటున్నాడు. దానికి తను ఎంత చక్కగా శిక్షణనిచ్చాడంటే అతని భార్యకి ఎప్పుడు కావాలంటే అప్పుడు కొబ్బరిబోండాలకి పీచుతీసి శుభ్రంచేసి యిస్తుందిట!


## పెయింటర్‌గా మారిన కూలీ

పెయింటర్‌గా మంచిపేరు రాకముందే పాల్ గాగ్విన్ పెనామా కాలువ తవ్విన కూలీల్లో ఒకడిగా పనిచేసేవాడట! ఆ కాలువ తవ్వటం మామూలు పనికాదు. దాని నిర్మాణంలో 25,000 కూలీలు ప్రాణాలు కోల్పోయారు.

## ఆవుల ఓనర్లకి గన్ లైసెన్సులు

అహ్మదాబాదు ప్రాంతంలో ఆవుల దొంగతనాలు ఎక్కువగా జరుగు తున్న నేపథ్యంలో వాటిని కాపాడుకోటానికి ఓనర్లకి ప్రభుత్వం గన్ లైసె న్సుల్ని మంజూరు చేసిందిట!

-తటవర్తి




సరళ స్నేహితురాలికి సరళ ఇంటి పరిస్థితి తెలుసు. ఒకసారి ఆమెని కలసినప్పుడు మందలింపుతో కూడిన హెచ్చరిక చేసింది.

"ఎంతసేపూ జీవితమంటే వండి వార్చడమేనా? ఒకసారి బయట ప్రపం చాన్ని చూడు. ఆడవారు అన్ని రంగాల్లో ఎలా దూసుకుపోతున్నారో తెలు స్తుంది. నిన్నెప్పుడో కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నాడని నీకు నువ్వే వంట దానిలా మారిపోయావు. ఆయన అడుగుతున్నాడు కదాని ఎడాపెడా రెండు చేతులతో వండి పడేస్తున్నావు. కొంచెం వయసు పెరిగి బిపి, షుగరు, గుండె జబ్బులు వచ్చాయంటే చిరుతిళ్లు కాదుకదా, మామూలు తిండి కూడా కష్టమయిపోతుంది. ఈ విషయం మీ ఆయనకు ఒకసారి చెప్పు. చిరుతిళ్లు కంట్రోల్ చేయకపోతే ఆనక నువ్వే బాధపడతావు" అంది. సరళ ఆలోచనలో పడింది. నిజమే. శివరావుకిప్పుడు నలభయ్యారు సంవత్సరాలు. ఈ రోజు వరకూ ఆరోగ్యం బాగున్నా భవిష్యత్తుని ఎవరు ఊహించగలరు? తన భర్త ఎలా అర్థం చేసుకున్నా ఈ విషయం అతడికి చెప్పాలనుకుంది. మంచి మూడ్‌లోవున్న శివరావు దగ్గర ఆ విషయం ప్రస్తావించింది.

"చిన్న వయసులో మనం ఏం తిన్నా ఫర్వాలేదు. కానీ వయసు పెరిగే కొద్దీ మనం జాగ్రత్తగా ఉండకపోతే ఆరోగ్యపరంగా సమస్యలు రావచ్చును. సరైన వ్యాయామం కూడా లేదు. వయసుకి మించి పెరిగిపోయారు. ఒక్క సారి మిమ్మల్ని మీరు అద్దంలో చూసుకోండి. పొట్ట సాగిపోయి కుండలా తయారయింది. మీకు అనారోగ్యమొస్తే నా గతేంకాను?" అంది మందలిం పుగా.

సరళ మాటలకు శివరావు అవాక్కయ్యాడు. అతడు చెప్పింది చేయడ మేకానీ ఏనాడూ కాదనలేదు. కానీ ఈనాడిలా హెచ్చరిస్తుంటే తను కూడా ఆలోచించాల్సిన విషయమే. తను ఇన్నాళ్లు గమనించలేదు. శరీరంలోని కొవ్వంతా పొట్టదగ్గర కేంద్రీకృతమవడంవలన బాగా ముందుకొచ్చి కుండ బోర్లించినట్లుగా తయారయింది. ఏదయినా చేయాలి!

"సరే సరళా! నువ్వు చెప్పిన మాట నిజమే. నేను అశ్రద్ధ చేయక జిమ్ కెళ్లి బాడీ ఫిట్‌నెస్ సంపాదించి స్లిమ్‌గా తయారవుతాను. నా వీక్‌నెస్ నీకు తెలుసుగా! నన్ను మాత్రం స్వీట్లు, చిరుతిళ్లు మానమని చెప్పొద్దు" అన్నాడు. అతడి మొండివైఖరికి సరళ గాఢంగా నిట్టూర్చింది.

★★★

శివరావుకి ఈమధ్య తరచూ దాహం అనిపించడం, తరచూ బాత్రూమ్ అవసరం కలగడం, ఆకలి పెరగడమేకాకుండా బరువు కూడా బాగానే తగ్గాడు. తను కష్టపడి వ్యాయామం చేయడంవల్లనే ఈ మార్పులన్నీ అని సంబరపడ్డాడు. కానీ ఏ పని చేసినా తొందరగా అలసిపోయేవాడు. సరళకి మనసులో అనుమానం కలిగి భర్తను పోరింది.

"ఎందుకైనా మంచిది. ఒకసారి డాక్టర్‌ను కలసి పరీక్షించుకోండి" అంది.

"అలాగే వెళ్తాలే" అంటూ అశ్రద్ధ చేయసాగాడు. 'ఒకవేళ డాక్టర్ దగ్గ రకు వెళితే తనకి ఏదయినా ఉందని చెబితే తన నోరు పూర్తిగా కట్టుకోవాల్సి వస్తుంది. చిన్నప్పటినుంచీ తనకి స్వీట్లంటే చాలా ఇష్టం. ఖర్మకాలి తినకూ డదంటే?' అందుకే డాక్టర్ని కలవడంలేదు.

★★★

ఆ రోజు ఆఫీసు నుండి వచ్చి మోటారు బైకు స్టాండు వేయబోతూ కంట్రోల్ తప్పి కాలికి కిక్ రాడ్ తగిలించేసుకున్నాడు.

దెబ్బ తగిలి కొద్దిగా రక్తం బయటకొచ్చింది. నొప్పిగా అనిపించి వెంటనే డెట్టాల్ వేసి క్లీన్ చేసాడు. నాలుగురోజులైనా, పదిరోజులైనా గాయం మాన కుండా అలాగే ఉంది. సరళ వత్తిడి చేసింది డాక్టర్ని కలవమని. శివరావుకి కూడా తన కాలు చూసి భయమేసింది. ఇక నిర్లక్ష్యం చేస్తే ఎటు తిరిగి ఏమ వుతుందోనని భయం కలిగింది. ఆ మర్నాడు డాక్టర్ని కలిసాడు. పరీక్షలు జరిపిన డాక్టర్ శివరావును తల వాచేలా చీవాట్లేసాడు.

"షుగర్ ఇంతలా ముదరపెట్టుకుంటే ఎంత ప్రమాదమో తెలీదా మీకు? ఆ ఎఫెక్టు కిడ్నీలు, కళ్లని కూడా డ్యామేజీ చేస్తుంది. చదువుకున్నవారు అయి ఉండి దీనివల్ల కలిగే అనర్థాలు తెలియదా? నేను చెప్పినట్లు విని మందులు వాడి ఆహార నియమాలు పాటిస్తే మీ వ్యాధి కంట్రోల్ అవు తుంది. లేకుంటే మీ ఇష్టం'' అన్నాడు.

శివరావుకు మొహం పాలిపోయింది. నోటమాట రానట్టుగా నిశ్చేష్టుడ య్యాడు. ఎలాగో గొంతు పెగల్చుకుని "సరే డాక్టర్! మీరు చెప్పినట్లుగానే చేస్తాను'' అన్నాడు.

ఆ రోజునుండి శివరావు జీవితంలో పూర్తి మార్పు వచ్చేసింది. చక్కెర లేని టీ, కాఫీలు, మితంగా ఆహారం, కాకరకాయలు, మెంతికూర, నూనెలేని పుల్కాలు. దీనికితోడు బిపి రాకుండా ఉప్పు కూడా అవాయిడ్ చేయమన డంతో అతడు పూర్తిగా తన జిహ్వాచాపల్యాన్ని అణచుకుని కడుపు మాత్రం నింపుకుంటున్నాడు. ఎప్పుడైనా స్వీటు తినాలనిపించినా ఇదివరకులా సరళ అసలు సహకరించక, చేయనని ఖచ్చితంగా చెప్పేస్తోంది.

మందులకు, డైట్ కంట్రోల్‌కు షుగరు వ్యాధి కంట్రోల్ చేసుకున్నా, తన కున్న స్వీట్ల పిచ్చికి నోరును ఎలా కంట్రోల్ చేసుకోవాలో అతడికి పెద్ద సమ స్యగా మారింది. టీవీలో వచ్చే ప్రకటనలకు, వంటల కార్యక్రమంలో చూపించే వెరైటీలకు, అతడి నోట్లో నోరూరి 'వీటిని చూసి టెంప్టవడం దేనికి? తినే అదృష్టం ఎలాగూ లేదు' అనుకుని ఛానెల్ మార్చబోతూ ఒక ప్రకటన చూసి ఠక్కున ఆగిపోయాడు.

ఒకే రకమైన స్వీటు రెండు ప్లేట్లలో పెట్టి ఒకరకం స్వీటులో కేలరీస్ అధి కంగా ఉండి మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా హానికరమని, ఎంత మాత్రం పనికిరాదని చెబుతూ ఇంకోరకం స్వీటును చూపిస్తూ దీనిలో జీరో కేలరీస్ ఉన్నాయని, ఇది షుగరు పేషెంట్స్ కూడా తినవచ్చునని, వారికి వర ప్రసాదమని చెబుతూ జీరో కేలరీస్ ఉన్న మా కంపెనీ షుగర్ ఫ్రీ ప్రోడక్ట్ వాడితే ఇక నుండి స్వీట్లకు దూరంగా ఉండాల్సిన పనేలేదని చెబుతున్నారు.

అతడి కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. దాచినా దాగని సంతోషంతో భార్యను పిలిచాడు. ఇంకా వస్తున్న ఆ ప్రకటనను సరళకి చూపించాడు. సరళకి ఆ ప్రకటన గురించి ఎప్పుడో తెలుసు. అతడు మాత్రం ఈ రోజే చూస్తున్నాడు.అతడి మనసు గ్రహించిన ఆమె "సరే! డాక్టర్ని అడగండి. ఆయన అనుమతిస్తే ఎప్పుడైనా తిందురుగానీ'' అంది.

శివరావు డాక్టర్ ముందు వాలాడు. అతడిని పరీక్షించిన డాక్టర్ 'ఫర్వా లేదు. మీ వ్యాధి కంట్రోల్‌కి వచ్చింది. జీరో కేలరీస్ ఉన్న స్వీటు ఎప్పుడైనా తినొచ్చు' అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

శివరావుకి తన స్వీటు సమస్యకి పరిష్కారం దొరికినందుకు ఏనుగెక్కి నంత సంబరంగా ఉంది. ఇదివరకులా ఇష్టానుసారంగా కాక ఎప్పుడైనా షుగరు ఫ్రీ క్రిస్టల్స్‌తో స్వీటు చేయించుకుని తింటూ ఎంజాయ్ చేస్తు న్నాడు. సరళ తల పట్టుకుంది. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోగానీ పోదంటారు. షుగరు వ్యాధి పుణ్యమా అని తన స్వీట్ల పిచ్చి తాత్కాలికంగా అణచుకుని దానికి ప్రత్యామ్నాయం దొరకగానే తన తీయని కోరికను బయట పెడుతున్నాడు.

ఏదయినా గ్రహదోషాలు, వాస్తు దోషాలు వున్నప్పుడు వాటిని పోగొట్టు కున్నందుకు గ్రహ, గృహ శాంతికి ప్రత్యామ్నాయం వెదుకుతుంటారు. దోషమున్నదానిని తొలగించి సబ్‌స్టిట్యూట్‌గా వేరేది ఉపయోగిస్తారు. ఒక ప్పుడు మధుమేహమంటే సగం చచ్చినవారితో సమానంగా భావించి ఆహార నియమాలు పాటిస్తూ నిస్సారమయిన జీవితాన్ని గడిపేవారు. కానీ శాస్త్రజ్ఞుల కృషి ఫలితంగా స్వీట్ టూత్‌గల శివరావులాంటివారి ఆశలు చిగు రించాయి. శివరావు రోజూ దేవుడికి పెట్టే దండంతోపాటు జీరో కేలరీస్ షుగరు ఫ్రీ క్రిస్టల్ తయారుచేసిన వారికి కూడా తన ధన్యవాదాలు తెలియ జేస్తూనే వున్నాడు. తన సమస్యకు తీయని పరిష్కారం లభించినందుకు ఉబ్బితబ్బిబ్బు అవుతూనే వున్నాడు.

కానీ సరళ మాత్రం మళ్లీ భర్తకి పిండి వంటలు అందిస్తూ బిజీ అయిపో యింది. ప్చ్... పాపం సరళ!

★



## విదేశీ యాత్రల్లో తమన్నా...

తమన్నాకి తెలుగులో ఆఫర్లు బాగానే వున్నా తమిళంలో మంచి గిట్టు బాటుగా వుందిట. తమిళంలో చాన్సులు అన్నీ ఇన్నీ కావట. పైగా ఈ సిని మాల షూటింగ్‌ల పుణ్యమాని విదేశాలు చూసేస్తోంది తమన్నా. పైసా ఖర్చు (సొంత డబ్బు) లేకుండా ఎంచక్కా ఫారిన్ కంట్రీస్ చూడ్డం అంటే అదృష్టం కాక మరేమిటి? దేనికైనా కలిసి రావాలి మరి!

